మినీకథ



# ఏమిటిది.... ఏమిటిది...?

ఎస్. అనూరాధ

"మిస్‌లీలా" ఊహాలోకంలోంచి ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది. తన క్లాస్ రిప్రజెంటేటివ్ జయ. 'తను 'మిస్' లీలా?' బుగ్గలు సిగ్గుతో ఎఱుపెక్కిపోయాయి. అంతలోనే తనకు తెలీకుండానే పెదవుల మీద చిన్ని నవ్వు... భుజం మీద మెత్తనిచెయ్యి పడటంతో ఆలోచనా ప్రవాహం నిలిచి పోయింది. "ఏం లీలా! లాస్ట్ అవర్ బంక్ చేసి వెళ్ళిపోతున్నావా?" జయ ప్రశ్నకి తెల్లబోయి జవాబుతెలియక తడబడింది. "లేదు... లేదు. నేను ఇంటికి వెళ్ళడం లేదే" ఆమె తడబాటుకి స్నేహితురాలు ఫక్కున నవ్వింది. "క్లాస్ ఇంకో ఐదు నిముషాల్లో మొదలవబోతూంటే ఇలా గేట్ వైపు దారితీస్తే ఇంకేం అనుకోవాలి మరి. పద, టైమవుతోంది" అప్పటిక్కాని తన చర్య తన కర్థం కాలేదు లీలకు. 'ఏమిటి, తనేంచే స్తోంది? తనసలు స్పృహలో ఉందా? ఇంత పరధ్యానం తననెలా ఆవహించింది?'

**　**　**

లీల ఇంకా ఆ అనుభూతి నుండి తేరుకోలేదు. 'ఎంత విచిత్రంగా ఉంది! ఇటువంటి అనుభవం ముందెప్పుడూ తన ఊహకైనా రాలేదు. అకస్మాత్తుగా అనుకోని విధంగా తనని కలవర పెట్టిన అతని సుదీర్ఘమైన ఉత్తరం... అబ్బ...ఎందుకో దాచుకుందామన్నాదాగటం లేదీ నవ్వు. ఎలా? ఈ చుట్టూ ప్రపంచం నుండి ఎక్కడికో దూరంగా పారిపోయిహాయిగా, తనివితీరా నవ్వుకోవాలనుంది. ఎలా? ఎలా??'

పుస్తకాలు ముందు వేసుకుని కూర్చుంది లీల. అయినా పదేపదే ఆ ప్రేమ లేఖలోని ప్రతి అక్షరం ఆమె కళ్ళముందు పరుగులెడుతూంది.

"లీలా డియర్!" 'ఆ సంబోధనే తనకి ముచ్చెమటలు పోస్తోంది. ప్రేమలేఖ అంటే ఇలాగే ఉంటుంది కాబోలు. అవునా?'

......లీలామాత్రంగానైనా ఈ దీనుడు గుర్తున్నాడా నీకు? ఉంటే ఇంతకాలం ఒక చిన్న పలకరింపుకైనా నోచుకోడా వీడు? ఏమంటావ్ లీలా? నీ నుండి లెటర్ ఆశించి ఆశాభంగం పొంది ఇక ఆగలేక ఇలా మొదలెట్టాను. ఎలా ఉన్నావ్? మన పెళ్ళయ్యాక నీకు వ్రాసే మొదటి ఉత్తరం కదూ ఇది. ఏమని పిస్తూంది ఇలా వ్రాస్తుంటే...అన్నట్లు నీ చదువెలా ఉంది? దానికేంలే,అది బ్రహ్మాండంగా ఉండి ఉంటుంది. అవునూ...ఆ చదువు నన్ను మరిపించేస్తోందా? ఏంటి లీలా, పిచ్చెక్కేలా ఉంది నాకైతే. నెక్ట్స్ సెకండ్ సాటర్‌డే, సన్‌డే, రెండు రోజులు నీ సాన్నిధ్యంలో గడపాలని ఉంది. అసలు రెక్కలు కట్టుకుని ఈ క్షణం రావాలనుంది. కాని నువ్వూ, నీచదువూ నన్ను ఇలా దూరంగా నిలిపేస్తున్నాయి.ఆ రెండు రోజులూ మాత్రం నాకోసం మిగులుస్తావని ఆశించ వచ్చనుకుంటాను. అయినా ఎగ్జామ్స్‌కి ఇంకా నెల్లాళ్ళుందిగా, ఎంత మెరిట్ స్టూడెంట్‌వైనా మరీ ఈ పతిదేవుల్ని కనికరిస్తావని ఆశ. ఇంకా ఏదో వ్రాయాలని మహాతపనగా ఉంది. కాని మొదటిసారి కదూ. సిగ్గువేస్తూంది, సో......బైబై...

నీ నుండి రిప్లైకోసం చూస్తూంటా. నీవాడైన...

--కాంత్.

"అక్కా...అక్కా అమ్మ పిలుస్తోంది" రవి పిలుపు విని గబుక్కున ఆ లేఖను మూసి లేచింది.

**　**　**

"మిస్టర్ శ్రీకాంత్! మీరు టైప్ చేసిన కాగితా ల్లో ముందెప్పుడూ ఇన్ని తప్పులు నేను చూడ లేదు. ఈరోజు మీరు అదోలా ఉన్నారు." ఆఫీసర్ రవీంద్రనాథ్ మాటలకి ఉలిక్కిపడ్డాడు శ్రీకాంత్.

"లేదుసార్...బాగానే ఉన్నాను...అయినా ఎక్కడన్నో పొరపాటు...మళ్ళీ టైప్ చేసి ఇస్తాను." తడుముకుంటున్నట్లున్న అతనిధోరణి ఆఫీసర్‌కి అర్థం కాలేదు. శ్రీకాంత్ మనసంతా గందరగోళంగా ఉంది. ఐదుగంట లెప్పుడవుతుందా అని ఆతురత పడుతోందతని మనసు. ఆశించిన ప్రేమలేఖ అందుకోనందుకు చికాగ్గా, అసంతృప్తిగా ఉంది. 'ఊహు...ఈవినింగ్ పోస్ట్‌లో కూడా తనకేమీ రాలేదు. చెప్పొద్దూ. వారం రోజుల నిరీక్షణకి అర్థం కరువైంది. చిరుకోపం కూడా వచ్చింది కొత్తపెళ్ళాం మీద. అసలు బయల్దేరకపోతేనో...రాబోయే రెండు రోజులూ ఆమెతో గడపాలని ముందుగా ప్లాన్ చేసు

కున్నాడు తను. కాని ఆమె అభిప్రాయం ఏమిటో...డిస్టర్బెన్స్ అనుకుంటుందా తన రాక? అయినా తను ఆగగలడా? ఉహు...తను ఆమెపై అలగలేడు.... ...'

** ** **

'అమ్మతో ఎలాచెప్పాలి అతనిరాక గురించి? చెప్పకపోతే క్రొత్త అల్లుడి ఆకస్మికరాకకి భలే కంగారు పడిపోతారు అమ్మా నాన్న. అయినా తానెలా చెబుతుంది! ఆ భావం వస్తేనే గొంతుక్కేదో అడ్డం పడినట్లు మాటే రావడం లేదు. అసలు ఊపిరి ఆడనట్లుగా ఉంది.'

"ఏమిటే లీలా, ప్రొద్దున్నే అలా ఊర్కేనే తచ్చాడుతున్నావ్? చిన్నదానికి కాస్త జడైనా వెయ్యరాదూ నువ్వు వేసుకున్న చేత్తో. దానికి స్కూలు టైమవుతోంది కాబోలు."

"అమ్మా" బావురుమంటున్న వల్లిగొంతు విని చేతిలో జడవదిలేసింది లీల. పార్వతమ్మ తలెత్తి చూసి, తెల్లబోయి ఒక్కక్షణం నిలబడి పోయింది. "లీలా! అదేం జడే? నీకీ మధ్య బొత్తిగా మతి ఉండటంలేదే. అదేంధోరణో! ఇలాంటి పిల్లలు చదువులేం చదువుతారే తల్లీ....." ఆవిడ ధోరణి అదే లోకంగా సాగి పోతోంది. చెల్లెలి జుట్టు మళ్ళీ చేతిలోకి తీసుకుని జడలు వెయ్యటం ఆరంభించింది అర్థకాని చూపులతో. 'తనేమిటిలా అయిపోతోంది? ఇదివరకు ఎంత ఎలర్ట్‌గా ఉండేది తను! మరి ఈ మార్పు... అతనే కారకుడు! అవును సుమా. తన రిప్లై అతని కందిందేమో. అతని కేమనిపించిందో తన ఉత్తరం చూస్తే. తనలాగే ఫీల్ అయి ఉంటారో, ఏమో! ఏమో...అతని భావాలు తనెలా తెల్సుకోగలదు? ప్చ్...అతనొస్తే తను అసలు మాట్లాడ గలదా? అతని ఎదుట నిలబడ గలదా? ఏమిటింత సంకోచం? పెళ్ళి సందడి సర్దు మణిగాక అతనికి మరెప్పుడూ ఎదురుపడనే లేదు. ఇప్పుడెలా? ఎలా?' సమాధానాలు తెలీని ప్రశ్నలు.

** ** **

"ఏం బ్రదర్! అయిదయ్యాఅవంగానే సీట్లోంచి లేచావ్, ఈరోజు"-రాజుపలకరింపుకి సమాధానంగా నవ్వేసి ఊరుకున్నాడు.

"అత్తారింటిగ్గాని వెళ్తున్నావా?" ముఖంలో ముఖం పెట్టి కళ్ళతో నవ్వుతూ ప్రశ్నిస్తున్న రాజుని చూసి భుజాలెగరేశాడు ఏం చెప్పాలో తెలియని శ్రీకాంత్. "మనలో మనమాట, ఎందుకైనా మంచిది డేట్స్ చూసుకుని వెళ్ళు" అర్థం కానట్టు చూశాడు అతని వైపు. "నువ్వొత్త అమాయకుడివి బ్రదర్. నీ శ్రీమతి క్యాజువల్ లీవ్ సంగతి కనుక్కున్నావా?" సడన్‌గా స్ట్రైక్ అయింది ఆ పరిస్థితి. 'అబ్బ, ఇన్నాళ్ళ నుండీ తనకీ ఆలోచనే రాలేదు. బాప్‌రే! ఈ ఆలోచనే ఇంత భయంకరంగా ఉంది. నిజంగా తనువెళ్ళే సరికి లీల.....' మరి ఆలోచించ లేకపోయాడు.

** ** **

"అమ్మా నేనీపూట అర్జంటుగా ఊరెళ్ళాలి" అన్నాడు ఉపోద్ఘాతంగా. ఆక్షణం వరకూ కావాలనే దాచి పెట్టాడు తన అభిప్రాయం. చెల్లాయి ఎక్కడ ఆట పట్టిస్తుందో అనే భయం ఓ ప్రక్క. విననేవింది కాబోలతని మాట–"ఏమిట్రోయ్ అన్నాయ్. వదినకాని అర్జెంట్‌గా రమ్మని వ్రాసిందా ఏమిటి?" ఒక్కసారి గొంతు పొలమారింది శ్రీకాంత్‌కి. 'అబ్బ, ఈ ఆడపిల్లలకి ఇలాంటివన్నీ ముందుగా ఎలా తెలిసిపోతాయో! అయితే తన లీల కూడా ఇలాగే ఆలోచిస్తూటుందేమో అక్కడ.


"ఏమిట్రా ఆ పరధ్యానం. నిజంగా లీల దగ్గరికేనా?" ముసిముసిగా నవ్వుతోన్న తల్లిని చూసి సిగ్గుపడి అక్కడ నుండి పారిపోయాడు. గబగబా సూట్‌కేస్ సర్దుకుంటూ హడావుడి పడిపోతున్న కొడుకుని గమనిస్తూనే ఉన్నాడు చలపతిరావు. ఆయనకి తన చిన్నతనం రోజులు గుర్తుకొస్తున్నాయి.

"వెళ్ళొస్తా నాన్న గారూ" గబగబా మెట్లు దిగి వెళ్తున్న కొడుకుని చూసి, "అదేమిట్రా భోజనం చెయ్యకుండానే బయల్దేరేవేం. మళ్ళీ అక్కడికెళ్ళే సరికి తెల్లవారిపోతుంది కదూ" అన్నాడాయన.

"భోజనం అయింది నాన్నగారూ" అంటున్న అన్నగార్ని చూసి పొట్ట పట్టుకుని మరీ నవ్వింది సునీత. "అన్నయ్యా...అన్నయ్యా... అబ్బ! ఇదేమిమతి మరుపురా. నువ్వుభోజనం చెయ్యలేదురా నాయనా. అమ్మ వడ్డించింది కాని, లోపలికి పద" ఉడుకుమోనం వచ్చేసింది శ్రీకాంత్‌కి. తను మర్చిపోతే పోయుండవచ్చు కాని తన కంటే చిన్నదైన చెల్లెలుకి తను పట్టు బడిపోయాడే అని మహారోషంగా ఉంది. విసురుగా లోపలికి నడిచాడు.

** ** **

"అరె, బావగారా! రండి,రండి" నవ్వుతూ ముందు కొచ్చి చేతిలో సూట్‌కేస్ అందుకున్నాడు రవి. మాధవరావు లోపల్నుండి వస్తూ అల్లుణ్ణి చూసి ఖంగారు పడిపోయాడొక్కక్షణం. "ఏమేవ్,అల్లుడొచ్చాడు. కాళ్ళకి నీళ్ళు పట్రా" గదిలో అన్యమనస్కంగా ఉన్న లీల చెవిన పడుతూనే ఉన్నాయి ఆ మాటలన్నీ. కదలలేకపోతోంది అక్కణ్ణుంచి. ఏదోనిస్సత్తువ ఆవరించేశిందామెను. సంతోషమో, భయమో, ఖంగారో, మరేదో అర్థంకాని భావన ఆమెను చుట్టేసింది. "లీలా" తండ్రి కేకవిని కూడా పలకలేకపోయింది. "లీల ఆగదిలో ఉందిబాబూ వెళ్ళు లోపలికి"...అడుగుల చప్పుడు దగ్గర వుతోంది. కళ్ళు ఎత్తడానికి సందేహంగా ఉంది. 'ఈ కనురెప్పలు ఇంత బరువులైపోయాయేమిటి?'




"లీలా" అతని పిలుపుకి ఉలిక్కిపడ్డట్టుగా తలెత్తింది. అతని పెదవులు కంపిస్తున్నాయి. ఒక్కక్షణం అలా నిల్చుండిపోయారు ఒకరి ముఖాల్లోకి ఒకరు చూసుకుంటూ. "లీలా" దగ్గరగా వచ్చి ఆమె చేతిని పట్టుకుని ఏదో పెన్నిధినందుకున్నట్లు హాయిగా ఊపిరిపీల్చుకున్నాడు. అతనిలో బెరుకు పారిపోయింది. ఆమె ముఖం నిండా స్వేద బిందువులు ముత్యాల్లా. గబుక్కున చేతిని విదిలించుకుని "కాఫీతెస్తా" అంటూ మెరుపులా మాయమైంది గదిలో నుండి. అతనూ అదేదో తియ్యని అనుభూతిలోంచి తేరుకోనేలేదు. అప్రయత్నంగా అతని చూపులు టేబిల్‌పై ఉన్న లెటర్‌పైన పడ్డాయి. 'అరె......తన ఎడ్రస్ వ్రాసుంది. దస్తూరి లీలదే......మరి......ఓహ్...పోస్ట్ చెయ్యడం మరిచిపోయింది కాబోలు.' లీల మనఃస్థితి ఊహించగల్గాడు. ఎందుకో అతనికి తెరలు తెరలుగానవ్వువస్తూనే ఉంది చాలా సేపటి వరకు.